ఇది కదా అభివృద్ధి

సరికొత్తగా.. సర్కారు బడి

'ప్రతీ విద్యార్థి ఉన్నత చదువులు చదువుకోవాలి.. అత్యున్నత శిఖరాలు అధిరోహించాలి. పేదరికం కారణంగా ఏ ఒక్క విద్యార్థి అవకాశాలను కోల్పోకూడదు. అందుకు **అనుగుణంగా** ప్రభుత్వ పాఠశాల**లను తీర్చిదిద్దాలి.. అన్ని సదుపాయాలు కల్పించాలి..**' అన్న సీఎం జగన్‌మోహన్ రెడ్డి సత్సంకల్పానికి ప్రతీక**గా నిలిచాయి** ప్రభుత్వ పాఠశాలలు. **ఒకప్పుడు** సదుపాయాల లేమి**తో వెలవె**లబోయిన బడులు **నేడు కార్పొరేట్** పాఠశాలలను తలదన్నే**లా అత్యాధు**నిక వసతులతో **దీటుగా నిలబడ్డాయి.**

- ఇస్లాంపేట, నడుపూరు హైస్కూల్స్‌కు సరికొత్త సొబగులు
- కోట్ల రూపాయలతో కార్పొరేట్‌కు దీటుగా వసతులు
- విద్యార్థులు, తల్లిదండ్రుల హర్షాతిరేకాలు


ఇస్లాంపేట జెడ్పీ హైస్కూల్ నిధులు **రూ.1.06 కోట్లు**

నడుపూరు జెడ్పీ హైస్కూల్ నిధులు **రూ.1.73 కోట్లు**

పెదగంట్యాడ: సర్కారు బ**డులు కళకళలాడుతు**న్నాయి. అత్యాధునిక సదుపాయాల**తో** విద్యార్థులను స్వాగతిస్తున్నాయి. నాడు–నేడు పథకంలో భాగంగా పాఠశాలలకు సరికొత్త రూపాన్ని తీసుకువచ్చింది రాష్ట్రప్రభుత్వం. నడుపూరు జిల్లా పరిషత్ హైస్కూల్‌కు రూ.1.73 కోట్ల నిధులు, ఇస్లాంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు రూ.1 కోటి 06లక్షలు మంజూరు చేశారు. ఆ నిధులతో పాఠశాల ఆవరణలను అందంగా తీర్చిదిద్దారు. విద్యార్థులకు సౌకర్యంగా ఉండేలా తరగతి గదులను రూపుదిద్దారు. క్లాస్‌రూమ్స్‌లో విద్యార్థులు కూర్చుకునేందుకు అనువైన, అత్యాధునిక బెంచీలను, డెస్కులను ఏర్పాటు చేశారు. వరండాల్లోనూ మార్బుల్స్‌తో గచ్చులు చేయించారు. పాత తలుపులు, కిటికీలను తొలగించి కొత్తవి అమర్చారు. వాటికి ఇనుపగ్రిల్స్ జోడించారు.

విద్యార్థులకు స్వచ్ఛ జలం

విద్యార్థులకు స్వచ్ఛమైన తాగునీటిని అందించేందుకు మినరల్ వాటర్‌ప్లాంట్ ఏర్పాటు చేశారు. మరుగుకు ఇబ్బంది లేకుండా, అత్యాధునికంగా బాత్‌రూమ్స్ నిర్మించారు. విద్యార్థుల సైకిళ్లను పార్కింగ్ చేసుకునేందుకు వీలుగా పార్కింగ్ షెడ్లు ఏర్పాటు చేశారు. మైదానంలో, తరగతి గదుల వద్ద అందమైన పూలకుండీలు, ఆహ్లాదకర వాతావరణంలో ప్రశాంతంగా చదువుకునేందుకు అవసరమైన అన్ని సదుపాయాలు కల్పించి ఆహా అనిపించారు. నడుపూరు జిల్లా పరిషత్ హైస్కూల్ ఇప్పుడు అన్ని హంగులతో కళకళలాడుతోంది. కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ఇక్కడ కూడా సదుపాయాలు కల్పించడంతో తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనపై అభినందనల జల్లు కురిపిస్తున్నారు.



ఇస్లాంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ముఖ ద్వారం


ఇస్లాంపేట పాఠశాలలో కొత్తగా నిర్మించిన అదనపు తరగతుల భవనం


నడుపూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల

సదుపాయాలు బాగున్నాయి



ఇస్లాంపేట హైస్కూల్‌లో మా అమ్మాయి 10వ తరగతి చదువుతోంది. ఈ బడిలో సదుపాయాలు బాగున్నాయి. పిల్లలు రోజూ స్కూల్‌కు వెళ్లడానికి ఉత్సాహం చూపిస్తున్నారు. గతంలో అధ్వానంగా ఉండడంతో పిల్లలు ఇంటికి వచ్చే వరకు ఆందోళన చెందేవాళ్లం. ఇప్పుడు చదువులు కూడా బాగుపడ్డాయి. అంతా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి దయే.

–కె.వరలక్ష్మి, విద్యార్థిని తల్లి, ఇస్లాంపేట

కార్పొరేట్ స్కూల్లా మార్చేశారు



నాకు కార్పొరేట్ స్కూల్‌లో చదువుకోవాలని ఉండేది. ఆ విద్యార్థుల మాదిరిగా హుందాగా ఉండాలని ఉండేది. ఆ కలను జగన్ మామయ్య తీర్చారు. మా బడిని కార్పొరేట్ స్కూల్‌కు దీటుగా తీర్చిదిద్దారు. నేను కూడా యూనిఫాం, షూతో హుందాగా స్కూల్‌కు వెళ్తున్నా. చదువుపై శ్రద్ధ పెరిగింది. మంచి మార్కులు సాధిస్తున్నా. పబ్లిక్ పరీక్షల్లో మంచి మార్కులు సాధిస్తాను.

– తులసి, 10వ తరగతి ఇస్లాంపేట జెడ్పీ హైస్కూల్

చదువులు చక్కబడ్డాయి



నడుపూరు హైస్కూల్లో మా అమ్మాయి 9వ తరగతి చదువుతోంది. ఒకప్పుడు ప్రభుత్వ పాఠశాలలో చదువంటే ఏదో మొక్కుబడిగా ఉండేది. ఇప్పుడు రోజులు మారాయి. పాలకులు కూడా మారడంతో చదువులు చక్కబడ్డాయి. చదువుతోనే మంచి భవిష్యత్తు ఉంటుందని గుర్తించి, ప్రతి ఒక్కరికీ చదువు అనే ఆస్తిని ముఖ్యమంత్రి జగన్ అందిస్తున్నారు. పిల్లల్లో ఆసక్తి పెరిగింది. వారిలో పోటీతత్వం వచ్చింది. మంచిగా చదువుతున్నారు.

– జి.భాగ్యం, విద్యార్థిని తల్లి, రామచంద్రనగర్

ఆహ్లాదకర వాతావరణం



మా బడి చాలా బాగుంది. ఆహ్లాదకర వాతావరణం నెలకొంది. మాకు అవసరమైన అన్ని సదుపాయాలు సమకూర్చారు. తరగతి గదులు బాగున్నాయి.. అన్ని విధాలా అద్భుతంగా తీర్చిదిద్దారు. పాఠాలు బాగా చెబుతున్నారు. కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా మా బడి ఉంది.

–ఎం దుర్గాప్రసాద్, 10వ తరగతి, నడుపూరు జెడ్పీ హైస్కూల్


నడుపూరు హైస్కూల్లో నూతనంగా నిర్మించిన సైకిల్ స్టాండ్


తరగతి గదిలో విద్యార్థులు

క్లుప్తంగా

అయోధ్య రామయ్య అక్షింతల పంపిణీ


అక్షింతలను పంపిణీ చేస్తున్న ఆర్యవైశ్య సంఘాల ప్రతినిధులు

గాజువాక : అయోధ్య రామమందిరం నుంచి తెచ్చిన అక్షింతలను శ్రీ వాసవి ఆర్యవైశ్య అన్నపూర్ణ నిత్యాన్నదాన పథకం సభ్యులు శుక్రవారం పంపిణీ చేశారు. పాతగాజువాకలోని శ్రీవాసవి కన్యకా పరమేశ్వరి ఆలయం ప్రాంగణంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అన్నదాన కమిటీ గౌరవాధ్యక్షుడు నంబూరి జగన్నాథం, చైర్మన్ కేసారపు శ్రీను రమేష్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఈ నెల 22న అయోధ్య రామ మందిరం ప్రారంభోత్సవం సందర్భంగా ప్రతి ఒక్కరూ తమ ఇంట్లోని పూజ గదిలో ఈ అక్షింతలు పెట్టి పూజలు చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు కులుకూరి మంగరాజు, ట్రస్టు ప్రధాన కార్యదర్శి కేవీపీ రావు, ప్రతినిధులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలకు సిటూ సంఘీభావ నిధి

ఉక్కునగరం: అంగన్‌వాడీ కార్యకర్తల సమస్యలు పరిష్కరించాలని స్టీల్ సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. వారికి మద్దతుగా సీఐటీయూ ఆధ్వర్యంలో శుక్రవారం సంఘీభావ నిధి వసూలు కార్యక్రమం చేపట్టారు. ప్రభుత్వం ఓ వైపు చర్చలు జరుపుతూ ఎస్మాను ప్రయోగించడం అన్యాయమన్నారు. రాజకీయాలకు అతీతంగా పోరాడుతున్న వీరికి ప్రతీ ఒక్కరు మద్దతు ఇవ్వాలన్నారు. ఇందు కోసం చేస్తున్న సంఘీభావ నిధికి సహకారం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ గౌరవాధ్యక్షుడు జె.అయోధ్యరామ్, అధ్యక్షుడు వై.టి.దాస్, ప్రధాన కార్యదర్శి యు.రామస్వామి, పి.శ్రీనివారాజు, గంగాధర్, టి.వి.కె.రాజు తదితరులు పాల్గొన్నారు.

అయోధ్య రాముడి క్యాలెండర్ల పంపిణీ


క్యాలెండర్లు పంపిణీ చేస్తున్న కరణంరెడ్డి

గాజువాక : అయోధ్య రాముడి చిత్రాలతో రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్లను బీజేపీ గాజువాక కన్వీనర్ కరణంరెడ్డి నర్సింగరావు శుక్రవారం పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ అయోధ్యలో బాల రాముని విగ్రహ ప్రతిష్ఠను పురస్కరించుకుని గాజువాకలో రెండు వేలమంది రామభక్తులకు క్యాలెండర్లను ఉచితంగా పంపిణీ చేసినట్టు తెలిపారు. క్యాలెండర్లతో పాటు రామమందిరం ప్రారంభోత్సవంపై ముద్రించిన ప్రత్యేక పుస్తకాలను కూడా అందజేశారు. కార్యక్రమంలో ఆటో యూనియన్ నాయకులు గొలగాని నాయుడు, రామచంద్రరావు, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కబడ్డీ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక


రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన జట్లు

గాజువాక : ఈ నెల 20 నుంచి 23 వరకు కర్నూల్‌లో నిర్వహించనున్న 49వ రాష్ట్రస్థాయి జూనియర్స్ బాలబాలికల కబడ్డీ పోటీలకు విశాఖకు చెందిన బాలబాలికలు శుక్రవారం పయనమయ్యారు. గంగవరంలో ఇటీవల నిర్వహించిన ఎంపిక పోటీల్లో విజయం సాధించిన క్రీడాకారులను ఈ పోటీలకు ఎంపిక చేశారు. 12 మందితో కూడిన బాలుర జట్టు, మరో 12 మందితో కూడిన బాలికల జట్టు ఈ పోటీల్లో పాల్గొననున్నట్టు విశాఖ జిల్లా కబడ్డీ సెక్రటరీ జేఎస్‌వీ ప్రసాద్‌రెడ్డి తెలిపారు. పోటీలకు పయనమైన క్రీడాకారుల వెంట కోచ్‌లు కారి లక్ష్మణరావు, ఎం.పోలయ్య తదితరులున్నారు.

వాలీబాల్ పోటీల విజేత ముత్యాలమ్మపాలెం

ఉత్సాహంగా 'ఆడుదాం ఆంధ్రా' మండల స్థాయి పోటీలు


హోరాహోరీగా తలపడుతున్న జట్లు


వాలీబాల్ విజేత జట్టుతో నిర్వాహకులు

అగనంపూడి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్రా క్రీడా సంబరాల్లో భాగంగా పరవాడ మండల స్థాయి వాలీబాల్ పోటీలు 79వ వార్డు లంకెలపాలెంలో హోరాహోరీగా సాగాయి. మహిళలు, పురుషుల విభాగాల్లో నిర్వహించిన పోటీల్లో మండలంలోని 14 గ్రామ సచివాలయాల నుంచి క్రీడా జట్లు పాల్గొన్నాయి. పురుషుల విభాగంలో ముత్యాలమ్మపాలెం, తానాం–2 (భరణికం) జట్లు తలపడ్డాయి. వీటిలో ముత్యాలమ్మపాలెం విజేతగా నిలిచి పెందుర్తి నియోజకవర్గ పోటీలకు ఎంపికై ంది. ఎంపీడీవో హేమసుందర రావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ క్రీడాకారుల ప్రతిభాపాటవాలను వెలికితీసే లక్ష్యంతో నిర్వహిస్తున్న పోటీల్లో క్రీడాకారులు స్ఫూర్తితో వ్యవహరించాలన్నారు. లంకెలపాలెం హైస్కూల్ హెచ్‌ఎం రౌతు నాగేశ్వరరావు, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్జీఎఫ్) జిల్లా కార్యదర్శి ఎం.వి.నాగేశ్వరరావు, ఆడుదాం ఆంధ్రా మండల కో–ఆర్డినేటర్ లోవరాజు, ఫిజికల్ డైరెక్టర్లు బి.అన్నాజీరావు, తులసీ సత్యవతి, ఎస్.వి.రమణ, శ్రీదేవి, షమా భాను, దేవి, అమ్మాజీ, గ్రౌండ్ ఇన్‌చార్జ్ ప్రసన్న కుమార్, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఉరి వేసుకుని యువకుడి ఆత్మహత్య


సాయి రామకృష్ణ మృతదేహం

అక్కిరెడ్డిపాలెం: ఓ యువకుడు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన గాజువాకలోని ఓ ప్రైవేట్ హాస్టల్‌లో చోటు చేసుకుంది. గాజువాక సీఐ ఎల్.భాస్కరరావు శుక్రవారం తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గుంటూరు జిల్లా గార్లపాడుకు చెందిన ఎన్.సాయి రామకృష్ణ (26) ఫుడ్ డెలివరీ బాయ్‌గా పని చేస్తూ గాజువాకలోని చైతన్యనగర్‌లో ఓ ప్రైవేట్ హాస్టల్‌లో ఉంటున్నాడు. ఇటీవల సాయి రామకృష్ణ తండ్రి నాగేశ్వరరావు గాజువాకకు వచ్చి కుమారుడిని పండగకు రమ్మని పిలిచి, స్వగ్రామం వెళ్లిపోయారు. తర్వాత హాస్టల్‌లో ఉన్న విద్యార్థులు, ప్రైవేట్ ఉద్యోగులు అందరూ పండగకు వారి ఊళ్లకు వెళ్లినా.. సాయిరామకృష్ణ మాత్రం ఒక్కడే హాస్టల్‌లోని తన గదిలో ఉండిపోయాడు. పండగకు ఊళ్లకు వెళ్లి శుక్రవారం తిరిగి వచ్చిన సాయి రామకృష్ణ రూం మేట్స్, తలుపులు కొట్టినా తెరవకపోవడంతో హాస్టల్ నిర్వాహకులకు తెలిపారు. వారు వచ్చి తలుపులు బలవంతంగా తెరిచి చూడగా గదిలో రామకృష్ణ ఫ్యానుకు ఉరి వేసుకుని, వేలాడుతూ ఉన్నాడు. గాజువాక పోలీసులకు సమాచారం అందించడంతో వారు సంఘటనా స్థలానికి చేరుకుని, వివరాలు సేకరించారు. మృతదేహాన్ని కేజీహెచ్ మార్చురీకి తరలించారు. కుటుంబ సభ్యులకు సమాచారం అందించామని, వారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేస్తామని సీఐ ఎల్.భాస్కరరావు తెలిపారు. ఉరి వేసుకుని 2, 3 రోజులు అయి ఉంటుందని పోలీసులు తెలియజేస్తున్నారు. మనస్థాపంతోనా, ఇతరత్రా కారణాల వల్ల ఆత్మహత్యకు పాల్పడ్డాడా అనేది తేలియాల్సి ఉంది. కుటుంబ సభ్యులు వస్తే కానీ పూర్తి వివరాలు తెలియవని పోలీసులు తెలిపారు.

నేరస్తులకు సహకరించడమూ నేరమే..

- క్రైం సీఐ సూర్యనారాయణ
- సెల్ ఫోన్ సర్వీసెస్, బైక్ మెకానిక్‌లకు అవగాహన


మాట్లాడుతున్న గాజువాక క్రైం సీఐ సూర్యనారాయణ

అక్కిరెడ్డిపాలెం: నేరస్తులకు సహకరించడం కూడా నేరమే అవుతుందని గాజువాక క్రైం సీఐ టి.సూర్యనారాయణ అన్నారు. ఈ విషయంలో అందరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సెల్ ఫోన్ సర్వీసింగ్ నిర్వాహకులకు, బైక్ మెకానిక్‌లకు, స్క్రాప్ దుకాణ దారులకు గాజువాక క్రైం పోలీస్ అధికారులు శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గాజువాక పోలీస్ స్టేషన్ వద్ద గల ఓ కల్యాణమండపంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. దొంగలు చోరీ చేసిన సెల్ ఫోన్ లాక్ ఓపెన్ చేసేందుకు, సాఫ్ట్‌వేర్ మార్పులకు సెల్ ఫోన్ సర్వీసింగ్ సెంటర్లను ఆశ్రయిస్తుంటారని, వారికి సహకరించడం నేరమని తెలిపారు. అలా ఎవరైనా వస్తే తమకు సమాచారం అందించాలని తెలిపారు. ఇటీవల ఖరీదైన ద్విచక్ర వాహనాలు చోరీకి గురవుతున్నాయని, ఆ బైకుల్లో పార్టులు మార్చేందుకు మెకానిక్‌లను ఆశ్రయిస్తారని చెప్పారు. అలా దొంగతనం చేసి మెకానిక్‌ల వద్దకు తీసుకువచ్చే వాహనాల సమాచారాన్ని తెలియజేయాలన్నారు. స్క్రాప్ దుకాణదారులు కూడా వాహనాల విడిభాగాలు కొనేముందు జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించారు. గాజువాక క్రైం ఎస్ఐ ఎ.మన్మథరావు, దువ్వాడ ఎస్ఐ కాళిదాసు, స్టీల్‌ప్లాంట్ ఎస్ఐ రుక్మాంగదరావు పాల్గొన్నారు.

అంబేడ్కర్ అందరికీ ఆదర్శం

పెదగంట్యాడ: రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ ప్రతీ ఒక్కరికి ఆదర్శమని వైఎస్సార్ సీపీ 76వ వార్డు సీనియర్ నాయకుడు మంత్రి శంకరనారాయణ అన్నారు. పెద నడుపూరులో అంబేడ్కర్ విగ్రహానికి శుక్రవారం ఆయన నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విజయవాడలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా అంబేడ్కర్ 125 అడుగుల విగ్రహాన్ని ఆవిష్కరించడం చారిత్రక ఘట్టమన్నారు. కార్యక్రమంలో ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

మంత్రి అమర్‌నాథ్ పుట్టినరోజు వేడుకల కరపత్రం ఆవిష్కరణ

అక్కిరెడ్డిపాలెం: రాష్ట్ర పరిశ్రమలు, ఐటీ శాఖా మంత్రి గుడివాడ అమర్‌నాథ్ పుట్టిన రోజును ఘనంగా నిర్వహించనున్నట్లు వైఎస్సార్ సీపీ 68వ వార్డు ఇన్‌చార్జి గుడివాడ లతీష్ తెలిపారు. వేడుకల కరపత్రాన్ని మింది బస్టాప్ వద్ద శుక్రవారం ఆవిష్కరించారు. లతీష్ మాట్లాడుతూ ఈ నెల 22న అమర్‌నాథ్ జన్మదినోత్సవం సందర్భంగా మంత్రి స్వగ్రామం మిందిలో 21వ తేదీ అర్ధరాత్రి కేక్ కట్ చేస్తారని తెలిపారు. వార్డు వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, గుడివాడ అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ ముఖ్యనాయకులు పాల్గొన్నారు.

పూరిల్లు దగ్ధం


దగ్ధమైన పూరిల్లును పరిశీలిస్తున్న పోలీసులు

కూర్మన్నపాలెం: విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా పూరిల్లు దగ్ధమైన ఘటన దువ్వాడ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. దువ్వాడ సీఐ శ్రీనివాసరావు తెలిపిన వివరాల ప్రకారం.. పెదగంట్యాడ మండలం నమ్మిదొడ్డి గ్రామంలో నమ్మి అప్పలరాజుకు చెందిన పూరిల్లు విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా దగ్ధమైంది. స్థానికుల సమాచారం మేరకు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేశారు. ప్రమాదం జరిగిన సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ప్రాణనష్టం తప్పింది. ఆస్తి నష్టం జరిగిందని, ప్రభుత్వం తమను ఆదుకోవాలని బాధితులు కోరుతున్నారు.

గొర్రెకు పోస్టుమార్టం

ఉక్కునగరం: అపహరించి, హతమార్చిన సంఘటనలో గొర్రెకు శుక్రవారం పోస్టుమార్టం నిర్వహించారు. స్టీల్‌ప్లాంట్ టౌన్‌షిప్ క్వార్టర్‌లో గొర్రెను కోసిన సంఘటన స్థానికంగా సంచలనం రేపింది. ఈ కేసులో స్టీల్‌ప్లాంట్ అధికారి, కార్మికుడు, కాంట్రాక్ట్ కార్మికులపై కేసు నమోదు చేసిన పోలీసులు గొర్రెకు దేవాడ పశువుల ఆస్పత్రిలో పోస్టుమార్టం చేశారు. గొర్రె పీక కోయడంతో ఊపిరి ఆడక మృతి చెందినట్లు పోస్టుమార్టం రిపోర్టులో వచ్చిందని స్టీల్‌ప్లాంట్ సీఐ వి.శ్రీనివాసరావు తెలిపారు. అనంతరం గొర్రెను స్థానికంగా ఖననం చేశారని చెప్పారు.

ఎన్‌జేసీఎస్ సమావేశం నేడు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ కార్మికులకు చెందిన జాతీయ ఉక్కు సంయుక్త కౌన్సిల్ (ఎన్‌జేసీఎస్) సమావేశం శనివారం నిర్వహించనున్నారు. న్యూఢిల్లీలో జరగనున్న ఈ సమావేశానికి ఎన్‌జేసీఎస్ పూర్తి కమిటీ సభ్యులకు ఆహ్వానం అందింది. 2021 అక్టోబర్ 22న జరిగిన ఎన్‌జేసీఎస్ సమావేశంలో కార్మికులకు కొత్త వేతనాలపై ఎంవోయూ జరిగింది. 2020 ఏప్రిల్ నుంచి వాటికి సంబంధించిన ఎరియర్స్ కూడా చెల్లించారు. ఆ ఎంవోయూలోనే ఉన్న విశాఖ స్టీల్‌ప్లాంట్ కార్మికులకు కనీసం కొత్త బేసిక్, డీఏలు కూడా అమలు కాలేదు. ఈసారి సమావేశంలో జాతీయ నాయకులు విశాఖ ఉక్కు కార్మికులకు నూతన వేతనాల అమలుకు పట్టుబడతారని కార్మికులు ఆశలు పెట్టుకున్నారు. ఈ సమావేశం సారాంశాన్ని బట్టి ఈ నెల 29, 30 తేదీల్లో జరిగే సమ్మె ఆధారపడి ఉంటుందని కార్మిక నాయకులు భావిస్తున్నారు.

తెలుగు సాహితీ వెలుగు రేఖ వేమన

ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి


దివంగత నేత వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి

సీతమ్మధార : తెలుగు సాహితీ వెలుగు రేఖ వేమన అని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. ఆశీలమెట్టలోని వేమన సంక్షేమ సంఘంలో నిర్వహించిన యోగి వేమన జయంతి కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో మంచీ చెడులను తెలియజేసిన మహా యోగి వేమన అన్నారు. ఈ కార్యక్రమంలో వేమన సంక్షేమ సంఘం గౌరవ అధ్యక్షుడు సత్తి నాగేశ్వరరెడ్డి, సలహాదారు డి.నారాయణరెడ్డి, అధ్యక్షుడు నీలాపు వివేకానందరెడ్డి, జనరల్ సెక్రటరీ సత్తి రామకృష్ణారెడ్డి (గౌతమి), కోశాధికారి బాలరెడ్డి, రిటైర్డ్ ప్రొఫెసర్ డాక్టర్ తాతారెడ్డి, రెడ్డి కార్పొరేషన్ డైరెక్టర్ బాకి శ్యాంకుమార్‌రెడ్డి, బోర కుమార్‌రెడ్డి, కార్పొరేటర్ సాడి పద్మారెడ్డి, నీలాపు రమణారెడ్డి, సత్తి సుబ్బారెడ్డి, సూర్యనారాయణరెడ్డి, శ్రీనివాసరెడ్డి, దల్లి రామకృష్ణారెడ్డి, ఇరిగేషన్ ఏఈ ధర్మేందర్‌రెడ్డి, బైరెడ్డి పోతన్నరెడ్డి, సంఘం నాయకులు పాల్గొన్నారు.

మళ్లీ అధికారంలోకి వైఎస్సార్‌సీపీ: 2024 ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రావడం ఖాయమని గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి తెలిపారు. ఆశీలమెట్టలోని వేమన సంక్షేమ మందిరంలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం దివంగత నేత వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. సీఎం జగన్ అనితరసాధ్యంగా సంక్షేమ పథకాలు అందిస్తున్నారన్నారు. ఎన్ని పార్టీలు వచ్చినా, ఎంత మంది నాయకులు కలిసినా అధికారంలోకి వచ్చేది జగన్ ప్రభుత్వమే అన్నారు. విశాఖ జిల్లాకు చెందిన స్థానిక రెడ్లను బీసీ'ఎ'లో చేర్చాలన్నారు. రెడ్డి సంఘానికి స్థలం కేటాయించాలని, బీచ్ రోడ్డులో యోగి వేమన విగ్రహం ఏర్పాటు చేయాలని కోరారు.

వేమన పద్యాలు.. జీవన సత్యాలు

- ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి
- జయంతి వేళ ఘన నివాళి


యోగి వేమన చిత్ర పటానికి పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే గురుమూర్తిరెడ్డి


69వ వార్డులో యోగి వేమన విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న కార్పొరేటర్ గోవిందరెడ్డి

పెదగంట్యాడ: వేమన పద్యాలు నిత్య జీవన సత్యాలని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. సమాజంలోని సమస్యలను భిన్న కోణాల్లో దర్శించి, తన పద్యాలతో జాతిని మేల్కొలిపిన మహనీయుడని కొనియాడారు. స్టీల్ వేమన సంఘం వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యుడు గొందేశి రాము ఆధ్వర్యంలో పెదగంట్యాడ జంక్షన్‌లో శుక్రవారం నిర్వహించిన యోగి వేమన జయంతి వేడుకల్లో వారు పాల్గొన్నారు. వేమన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వేమన పద్యాల గురించి వివరించారు. వేమన తన సాహిత్యంతో సామాజిక చైతన్యం తీసుకువచ్చారన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే తిప్పల గురుమూర్తిరెడ్డి, 74వ వార్డు కార్పొరేటర్ తిప్పల వంశీరెడ్డి, నాయకులు గొందేశి మహేశ్వరరెడ్డి, భసాసాదూరెడ్డి, గొందేశి సత్యారావు, వెంపాడ అప్పారావు, పులి రమణారెడ్డి, గొందేశి పెదరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

69వ వార్డులో..

అక్కిరెడ్డిపాలెం: 69వ వార్డు తుంగ్లాంలోని వేమన మందిరంలో యోగి వేమన విగ్రహానికి కార్పొరేటర్ కాకి గోవింద రెడ్డి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. కార్యక్రమంలో వేమన సంఘం అధ్యక్షుడు కొల్లి పెంటయ్యరెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, దూడ పాపారావు, ముసిలిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల శంఖారావానికి తరలిరావాలి

వైఎస్సార్‌సీపీ గాజువాక సమన్వయకర్త ఉరుకూటి చందు


సమావేశంలో మాట్లాడుతున్న ఉరుకూటి చందు

పెదగంట్యాడ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఉత్తరాంధ్ర నుంచి ఎన్నికల శంఖారావం పూరించనున్నారని వైఎస్సార్ సీపీ గాజువాక సమన్వయకర్త ఉరుకూటి రామచంద్రరావు(చందు)అన్నారు. ఈ నెల 25న భీమిలిలో నిర్వహించనున్న భారీ బహిరంగ సభకు గాజువాక నియోజకవర్గం నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలి వచ్చి సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. 76వ వార్డు నడుపూరులో వార్డు నాయకుడు దొడ్డి రమణ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన ముఖ్య నాయకుల సమావేశంలో చందు మాట్లాడారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి 175కి 175 స్థానాలు సాధించేలా ఎన్నికల ప్రచారం చేసి, మళ్లీ జగనన్నను ముఖ్యమంత్రిగా చేద్దామన్నారు.

అంబేడ్కర్‌కు నివాళి

భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 125 అడుగుల విగ్రహాన్ని విజయవాడలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆవిష్కరించిన సందర్భాన్ని పురస్కరించుకుని నడుపూరులోని ఎస్సీ కాలనీలో గల అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ పరంకుశం ప్రమీల, నరసింహమూర్తి, వార్డు క్లస్టర్ ఇన్‌చార్జి కులుకూరి మంగరాజు, నాయకులు మంత్రి శంకరనారాయణ తదితరులు పాల్గొన్నారు.